## ఇఱికల

పుస్తకాల్లో శ్లోకానికీ వ్యాఖ్యానాలకూ
సరిహద్దు నల్లనిగీత సూచించినట్టు,
పల్లెటూరి జీవనాన్ని పట్నవాసపు జీవనాన్ని సర్వసాధారణంగా కేటాయించి కాపరచేది స్థానికపరిపాలనవారి యెల్లబల్ల. ఇక్కడకు "మ్యునిసిపల్ లిమిట్" అనుకుంటూ ఒక అడుగుదాటి రోడు ప్రక్కకు చూడ్డంలో కాంతారావుకు ఏకాంతశర్మకు ఇద్దఱకూ కూడా ఏవో పువ్వులు లక్షోపలక్షలుగా పూసివున్న ఒక ఎకరం బంగన బయలు సాక్షాత్కరించింది. కాంతారావు ఏకాంతశర్మ ఇద్దఱూ షికారుగా బయలుదేఱిన నవనాగరీకులు, పరోపకార పరాయణులు, ప్రకృతి పరిశీలనా మహాశయులు, సంఘ సంస్కార ప్రియులూను.

పువ్వులెలా పూసివున్నాయి అంటే, పరుపుకు టాకాలు వేసే సమయంలో పైకి లాగేటప్పటి దారాల పొడుగుల్లా కాడలు లేచి ప్రతీకాడ చివర్నా మఱీ పసుపచ్చకానట్టి మఱీ తెలుపులేనట్టి లేలేత వెన్నెతో, మఱీ చిన్నకాని మఱీ పెద్దాకాని పరిమాణాన్ని ఆకారాన్ని పొడగడుతూ వున్నాయి. పువ్వులకాడల దిగుదల్ని నక్షత్రచామంతి ఆకులా ఆకువుంది. ఆ ఆకునుబట్టీ ఇంకా తిలకిస్తే అదోనేల బారుతీగ. తీగకూ తీగకూ మధ్య మామోలు గరిక—ఎవరో రైతు తన దూడలకొఱకుగాను పెరగనిస్తూ కాపాడుకుంటూవున్న గులకరా ప్రదేశం! ఏదీ మెయ్యడం లేదు. ఎవరూ త్రొక్కి పారేసిన జాడాలేదు. కాంతారావు ఏకాంతశర్మ ఆ ప్రదేశంలోని కడుగిడ్డానికి కొంకిజంకి ఆలా గట్టుమీదనే

ఆసీనులై "ఆహాహా! ఏమి సొగసుగా నున్నాయి పువ్వులు!" అని అనుకోసాగారు.

అంతలో ఏమూలనుంచి వచ్చిందో ఓ మదవతి మాలెత, చేతిలో వడపలెట్టుకువచ్చి, వచ్చీ రావడంలో పరపరాకోయడం ప్రారంభించింది, కించిత్తూ సంకోచంలేకుండా గడ్డినీ కాడనూ కలిపికోయడం ప్రారంభించింది.

కాంతారావు "ఎవరివనే ఆలా కోసి వేస్తూవున్నావు ఆ పువ్వుల?" అన్నాడు. మాలెత వంకచూస్తూ. "పువ్వులేంటుండి ఇవి? కాడ! ఇదంతా గడ్డి. నాదేనుండి." అంది ధైర్యంగా. ఏకాంతశర్మ "నీ తలకాయి." అన్నాడు. "తలకాయ అవితే కొడవిలితో సరుక్కుంటూ పోతారా? తలమీదకేనుండి—తలమీదకూ కాదండి—గేదలకండి." అంది మాలెత, కాంతారావు "దాంతో పరాసికాలేంటి మనకు" అంటూనే దాని అసంస్కృతపు శిరోజాలనుగంటూ జాలిగొన్నాడు. ఏకాంతశర్మ దాని పామరత్వానికి విస్తుపోయాడు.

ఆమె క్షణికంలో పది పంద్రెండు సందెళ్ళ గడ్డీకాడా కోసికొని మోపుగా జూసుకుని నెత్తిమీదను మోసికొంటూ పట్నం వెంపుకు బయలు దేఱింది.—"మఱి చీకటి పడిపోయేని"—అనుకుంటూ లేచినట్టుగా కాంతారావు ఏకాంతశర్మ తాము కూర్చున్నచోటినుంచి లేచినవారై ఆమె వెనకాతలే పట్నం వెంపుకే వెడుతూవున్నారు.

వాళ్ళదృష్టి ఆ మాలెత నెత్తిమీదవున్న మోపుమీదనూ మోపులోని పూలమీదనే ఉంది.—ఆ పువ్వుపేరు తెలిసికొందామని వాళ్ళకుతూహలం. అడిగితే వాళ్ళయొక్క అజ్ఞానం బయలు

పడిపోతుందేమో ? అడక్కపోతే అది చెప్పనే చెప్పదు. దాని కదో పువ్వు అన్న గోప్యమేలేదు. పువ్వునుకూడా గడ్డితోనూ కాడతోనూ కలిపి కోసి పారేసిందాయిరి. మఱిదానికో పేరూ కీర్తీవుందని వెల్లడిపరుస్తుందా ?—అడిగితే ఏమో ?—అది గబగబా నడుస్తూవుంది. దానితో సరిసమానంగా వీళ్ల నడవలేకుండా ఉన్నారు.—ఆగుమని కేకేస్తే బాగోదు.

ఎదర ఎవడో వస్తూవున్నట్టయింది. మాలెత దాని నడక దూకుడు కొంచెం తగ్గిస్తూ కాంతారావుకూ ఏకాంతశర్మకూ దగ్గఱలో ఆగింది. ఏకాంతశర్మ " అమ్మీ ! ఆ పూలపేరేమిటి?" అన్నాడు. మాలెత.....................

" ఇటికల పువ్వంటే తమ రెరుగర బాబయ్య ! "—అంది వెనక్కు తిరిగిచూస్తూ. ఆ యెదరనుంచి వచ్చేవాడు ఒక్క హుఠామున ఎగిరి కఱ్ఱతో తన చేతిలోని.—

" ఇటికల పువ్వంటేనా ? "

" సిరిసిరి మువ్వకు సెల్లాయి తెలిసిందా పిల్లా "—అంటూ మాలెతయొక్క నెత్తిమీది మోపు మెటకరించి నేలమీద పడేటట్టు చేశాడు.

" చూశారా. ఈఁడి దురంతం బాబయ్యలూ. చూశారా. ఈఁడి దురంతం. నోటికాడ కూడు ఏలా పడగొట్టేస్తూ ఉన్నాడో చూడండి బాబయ్యలూ. " అంది మాలెత. కాంతారావు ఏకాంత శర్మ ఆవల వానికేసి చూచారు. " నీకేం పొయ్యేకాలం వచ్చిందిరా. ఆలా క్రిందికి తోసేశావు దాని నెత్తిమీది మోపును" అని అడిగాడుకూడాను కాంతారావు కుసింత ఉగ్రుడై. ఆవలి వానికి భయమా ? " నాది ఈ పొలం. నాదీ ఆనేల, అక్కడ

నన్ను కాపెట్టినారు మా ఖామందులు చూస్తూయుండుమని—గేదెల కోసంగాను నిలబెట్టుకుంటూన్న కాడ, పూలుపూసింది లగాయతు, ఒకటే తెగ్గోసుకుపోవడం, తెలీకుండా దిగబడి తెగ్గోసుకుపోవడం, "నాను తిన్నాను." అని మాఖామందులు నన్నుకొట్టడం. ఈయేల దొరికింది—తమరెనకెంపు ఉండబట్టి దొరికింది లేక పోతే పరుగు లంకించుకుంది అంటే నెత్తిని మోపు "నిమిట్"కు మైలెగరేసుకుపోతుంది—దాని కాళ్ళకున్న పొడుగు కొంగకన్నా ఉండబోదు అయ్యలూ." అన్నాడు. కాంతారావు ఏకాంతశర్మ దాని కాళ్ళవంక చూచారు. నిజంగా ఆ కాళ్లు అల్లాంటివే—" అవలివాడు "వేళ్ళతో కొడవలుచ్చుకు కోసిందా అంటే బాబయ్యలూ! అవి (వేళ్లో మరకీళ్లో అన్న వడి కాపరుస్తాయి. ఎప్పుడన్నా చూచారో లేదో"—కాంతారావు ఏకాంతశర్మ "చూచాం ఇప్పుడే అక్కడ చూచాం అన్నట్టు తలలుతిప్పి కళ్లు విప్పారు. మాలెత "బాబులు సాక్షులు! నానుకోసింది రోడ్డువార గులకరాల మధ్యదికాని మీ దొరగారి పంపులోది కాదురా. ఈ పోద్దట్టుకు పోనీయి. ఎందుకు నన్నిబ్బంది పెడతావు." అంది. కాంతారావు ఏకాంతశర్మకూడా అమ్మితే ఏమొస్తుందే ఈ మోపుకి" అని అడిగారు దాని బుద్ధి దొంగబుద్ధీ అనకుండా దొరబుద్ధీ అనకుండా. "అమ్మితే పావులాఅండి. అమ్మకపోతే అంబోతుకేనండీ" అంది. అవలవాడు "ఊఁ—అఁబోతుకి? రోజూ నీ మోపుతినే పట్నంలోని పెద్దాంబోతు బలిసిపోతూవుంది ఆలా—నీ మోపుతినే?" అంటూ దాన్ని ఆ మోపు పట్టుకుని వెళ్ళనిచ్చాడుకాడు. ఆ మాలెత అల్లా ఆ మోపుమీద చతికిలబడి, వాడు ఆ మోపును కదలిద్దామన్నప్పుడల్లా, "కుయ్యోమొయ్యో" మనసాగింది.

కాంతారావు ఏకాంతశర్మ ఇద్దఱూ ఏదో కూడబలుక్కుని ఒక పావలాకాసు అక్కడపెట్టి మీ యిద్దరిలో ఎవరో ఒకరు ఆ పావలా తీసికొని రెండోవారు ఆ మోపు పట్టుకుపోండి అని సూచించారు. మాలెత "పావలాకోసం మోపుకోసం మీరు సరిది చెప్పారా, ఈపైని కొడవలి వాడిదంటాడు" కాంతారావు "ఏదీ కొడవ లెక్కడుంది ?" అన్నాడు. ఆవలవాడు "ఆ మోపులోనే గ్రుచ్చి గ్రుచ్చి ఉంచి ఉంటుంది." ఏకాంతశర్మ "పువ్వుల్లో కొడవలి ? కొడవలి ? కోయడమే కాకుండా ఇంకా ఆ కోయబడ్డ పువ్వుల్లోనే కొడవలి ఉంచడం ?" 'ఎంతఘోరం. ఎంతఘోరం.' అన్నాడు. కాంతారావు "లే. మోపులో కొడవలుంటే, మోపు మీద చతికిలబడి తైతక్క లాడుతున్నావు. క్రుచ్చుకోదుటే" అన్నాడు. ఏకాంతశర్మ పువ్వుల్ని చూస్తూ కరిగిపోయేడు. కాంతారావు మాలెతను చూస్తూ కరుణగొన్నాడు.

మాలెత "ఏదిరా ? కొడవలేదిరా ? నాదీలేదు. ఆడిదీ లేదండీ బాబులు కొడవలేలేదు. నే కోసింది గటికమ్మతోనండి" అంది. ఆవలివాడు బాబులూ ! మీరు మీమానాన్ని వెళ్ళండి. మా తిప్పలు మేం పడతాం. కొడవలీ యివల పడుతుంది. గొడవేదో అదీ బయలుపడుతుంది" అన్నాడు.

వాడు దాన్ని అక్కడ హత్యగావిస్తాడో ఏమో అన్నంత అనుకంప, కంపరం, పొందుతూ కాంతారావు ఏకాంతశర్మ, ఆ తగువులాడుతూవున్న వాళ్ళ యిద్దఱి చేతుల్లోనూ చెరో అర్ధా పెట్టి—"పోండి. ఎవరిళ్లకు వాళ్లు పోండి" అని పంపేశారు. పంపేస్తూ ఆ గడ్డిమోపును పరీక్షింప సాగారు.

మాలెత అర్ధరూపాయ చేతపట్టుకునే వూరికే వెనుచూపులు రోడ్డుమీద గడ్డిమోపుకేసి చూస్తూపోయింది. పాలేరువాడు అర్ధ రూపాయ చేతిలోపట్టుకునే వూరికే ప్రక్కచూపులు పొలంకేసి చూసుకుంటూ పోయాడు.

కాంతారావు ఏకాంతశర్మ ఆ గడ్డిమోపును పట్నంలోకి మోసుకుపోతే ఏ ఆంబోతైనా తింటుందని ఆలా ఒకళ్ళ తరువాత ఒకళ్లు నెత్తినెట్టుకుంటూ.

" ఇటికల పువ్వంటే తమ రెరుగర బాబయ్యా. "

" సిరిసిరి మువ్వకు సెల్లాయి తెలిసెన ఓ పిల్లా " అని పదం ఆడుకుంటూ సాగిపోయారు.

కనబడ్డ మాలెతలల్లా తమ కెందుకండి ఆ బారం అని అడగడమే—కలుసుకున్న పాలేరువాడల్లా " మీరు కోసిందేనా ఇదంతా ? " ప్రశ్నించడమే. ఆంబోతు మేతగ్గాను ఆ మోపు వారిచే గొంపోబడుతూ వుందని గుర్తించిన పౌరుడొక్కడులేడు, పాంథు డొక్కడులేడు.